# 'అరూరి' కోసం హైడ్రామా



**బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల తోపులాట**

**మీడియా సమావేశం అడ్డగింత**

**బలవంతంగా కేసీఆర్ నివాసానికి తరలింపు**

**పెంబర్తి వద్ద ఎర్రబెల్లి కారును అడ్డుకున్న బీజేపీ కార్యకర్తలు**

**తోపులాటలో చిరిగిన మాజీ ఎమ్మెల్యే చొక్కా**

**బీజేపీ రెండో జాబితాలో అరూరి రమేష్ పేరు?**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కు చెందిన హనుమకొండ ఇంటి వద్ద బుధవారం హైడ్రామా చోటుచేసుకుంది. బీజేపీలో చేరేందుకు నిర్ణయించుకుని, ప్రెస్ మీట్ పెట్టిన అరూరిని బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అడ్డుకుని తమ కారులో ఎక్కించుకుని తీసుకెళ్లడంతో ఆరూరి అనుచరులు నిశ్చేష్టులయ్యారు. అరూరి బీజేపీలో చేరుతారని గత కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. దీనిని నిజం చేస్తూ మంగళవారం హైదరాబాద్ కు విచ్చేసిన అమిత్ షాను కలుసుకుని, పార్టీలో చేరేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ మేరకు తాను బీజేపీలో చేరుతున్న విషయాన్ని మీడియాకు చెప్పేందుకు బుధవారం ఉదయం విలేఖరులను ఆహ్వానించారు. మరికొద్ది సేపట్లో సమావేశం మొదలవుతుందనగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

## పార్టీ మారే ఆలోచన..

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హైదరాబాద్ కు విచ్చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు పలువురు బీజేపీ నాయకులను అరూరి రమేశ్ కలిసి పార్టీలో చేరే అంశంపై చర్చించినట్లు ప్రచారం సాగింది. బుధవారం బీఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమై ప్రెస్ మీట్ పెట్టారు. ఈలోపు అక్కడికి చేరుకున్న ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీలోనే ఉండాలని నచ్చజెప్పేందుకు ప్రయత్నించడంతో డ్రామాకు తెరతీశారు. మాజీ మంత్రి హరీశ్ రావు సైతం ఆరూరికి ఫోన్ చేసి పార్టీలోనే కొనసాగాలంటూ కోరారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి వర్ధన్నపేట ఎమ్మెల్యే గా గెలిచిన అరూరి రమేష్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు చేతిలో ఓటమి పాలయ్యారు. ఉమ్మడి వరంగల్ రాజకీయాలను ప్రభావితం చేయగలిగిన ఎస్సీ నేతగా రమేశ్‌కు గుర్తింపు ఉంది. ప్రస్తుతం బీఆర్ఎస్ వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. ఓటమి తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ బలహీనపడుతుండటంతో పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు.

## రంగంలోకి ఎర్రబెల్లి..

విలేఖరుల సమావేశం ప్రారంభానికి ముందే ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నాగుర్ల వెంకటేశ్వర్లు ఇతర పార్టీ నేతలతో కలిసి అరూరి రమేష్ ఇంటికి చేరుకున్నారు. తగిన గుర్తింపునిస్తాం.. పార్టీలోనే ఉండాలంటూ ఆరూరికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అరూరి ససేమిరా అనడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రంగప్రవేశం చేసి పార్టీ మారడంతో వచ్చే ప్రమాదాలను వివరించారు. బీఆర్ ఎస్ లోనే కొనసాగాల్సిందిగా అరూరిని అభ్యర్థించారు. అయినప్పటికీ తన నిర్ణయాన్ని మార్చుకునేది లేదంటూ అరూరి ప్రకటించడంతో ఆయనను బలవంతంగా హైదరాబాద్ లోని కేసీఆర్ నివాసానికి తరలించేందుకు ప్రయత్నించారు.

## తోపులాట..

అరూరిని బలవంతంగా తరలించేందుకు ప్రయత్నించడంతో ఆయన అనుచరులు ఒక్క సారిగా ఖంగుతిన్నారు. వారి కారుకు అడ్డుతిరిగారు. కొంతసేపు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువైపులా పోటాపోటీ నినాదాలు కొనసాగాయి. చివరకు ఆరూరిని ఎర్రబెల్లి దయాకర్ రావు, బస్వరాజు సారయ్య ఉన్న కారులో బలవంతంగా ఎక్కించి సంఘటన స్థలంనుంచి నిష్క్రమించారు. అయితే అరూరిని జనగామలో ఉన్న హరీశ్ రావు వద్దకు తీసుకువెళ్తున్నట్లు ప్రచారం సాగింది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు అరూరిని బుజ్జగించి పార్టీలోనే కొనసాగించే బాధ్యతను హరీశ్ రావు చేపట్టినట్లు తెలుస్తోంది.

## పెంబర్తిలో అడ్డగింత..

ఈ క్రమంలో జనగామ జిల్లా పెంబర్తి దగ్గర ఉద్రిక్తత నెలకొంది. ఆరూరి రమేష్ ను ఎర్రబెల్లి హైదరాబాద్‌కు తరలిస్తుండగా బీజేపీ కార్యకర్తలు పెంబర్తి ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాన్ని అడ్డుకున్నారు. కారులోంచి అరూరిని బయటకు లాగేందుకు ప్రయత్నించారు. ఎర్రబెల్లి కారులో ఉన్న అరూరిని కిందికి దింపి వేరే కారు ఎక్కించేందుకు ప్రయత్నించారు. దీంతో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో అరూరి రమేష్ చొక్కా చిరిగిపోయింది. ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేశారు.

## ఫోన్‌లో కిషన్ రెడ్డి..

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో అరూరి రమేష్ ఫోన్లో మాట్లాడారు. తనను ఎవరూ బలవంతంగా తీసుకెళ్లడం లేదంటూ ప్రకటించారు. వ్యక్తిగత పనిమీద వెళుతున్నానంటూ వెల్లడించారు. బీఆర్ ఎస్ నాయకులతో మాట్లాడి వస్తానంటూ కిషన్ రెడ్డికి సమాధానం ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి ఎర్రబెల్లి దయాకర్ రావు వాహనం ఎక్కి రమేష్ వెళ్లిపోయారు.

## కొత్త ట్విస్ట్..

వరంగల్ పార్లమెంటు స్థానాన్ని తనకు కేటాయించాలంటూ అరూరి రమేశ్ బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని కోరారు. అయితే ఇక్కడినుంచి కడియం శ్రీహరి తనయ కడియం కావ్యకు పార్టీ అవకాశం కల్పించినట్లు ప్రచారం సాగింది. దీంతో అసహనానికి గురైన అరూరి పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. బీజేపీలో చేరి ఇక్కడినుంచే పోటీ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి మంగళవారం హైదరాబాద్ వచ్చిన అమిత్ షాను కలిసి సంప్రదింపులు జరిపారు. అదే విధంగా పలువురు బీజేపీ నేతలతోనూ ఆయన చర్చించారు. ఈ నేపథ్యంలో బీజేపీ రెండో జాబితాలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంనుంచి అరూరి రమేష్ పేరును పార్టీ ఖరారు చేసింది. ఇదే సమయంలో ఆరూరిని కేసీఆర్ నివాసానికి తరలించిన బీఆర్ఎస్ శ్రేణులు ఆయనతో గంటలకొద్ది మంతనాలు జరిపారు. పార్టీలో కొనసాగాలంటూ సూచించారు. దీంతో వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ప్రకటనపై సందిగ్ధం నెలకొంది.

### నన్ను ఎవరూ కిడ్నాప్ చేయలే..: – అరూరి రమేశ్

కేసీఆర్ నివాసానికి చేరిక అరూరి రమేశ్‌ను పలువురు విలేఖరులు ప్రశ్నించగా తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని చెప్పుకొచ్చారు. తను బీఆర్ ఎస్ లోనే కొనసాగుతున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకులతో కలిసి హైదరాబాద్ వస్తే కిడ్నాప్ ఎలా అవుతుందంటూ ప్రశ్నించారు. మంగళవారం అమిత్ షాను కలువలేదని, పలువురు బీజేపీ నేతలతో మాట్లాడానని ప్రకటించారు. అయితే బీజేపీలో చేరుతున్నట్లు చెప్పలేదన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు, బస్వరాజు సారయ్య, నాగుర్ల వెంకటేశ్వర్లు ఇతర పార్టీ నేతలతో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో అరూరి పాల్గొన్నారు.

# సమాజం ఛీత్కరించినా.. కేసీఆర్‌కు బుద్దిరాలే



**అబద్దాలు, అభూత కల్పనలతో మభ్యపెట్టే యత్నం**

**కరీంనగర్ సభలో పచ్చి అబద్దాలు చెప్పారు**

**కేంద్రం నిధులిస్తే పక్కదారి పట్టించిన ఘనుడు**

**మండిపడ్డ బీజేపీ ఎంపీ బండి సంజయ్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేసీఆర్‌ను తెలంగాణ సమాజం ఛీత్కరించిన బుద్ధిరాలేదని బీజేపీ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. పచ్చి అబద్దాలు, అభూతకల్పనలతో మళ్లీ ప్రజలను నమ్మించే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్ కదనభేరి సభలోకేసీఆర్ మాట్లాడిన వ్యాఖ్యలకు సంజయ్ కౌంటర్ ఇచ్చారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. కేంద్రం నిధులు ఇచ్చినా బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మ్యాచింగ్ గ్రాంట్ ఎందుకు ఇవ్వలేదని బిజెపి ఎంపి బండి సంజయ్ ప్రశ్నించారు. కేంద్రం నిధులను కెసిఆర్ ఇతర కార్యక్రమాలకు మళ్లించారని, నిధుల మళ్లింపుపై గతంలో కేంద్రం లేఖలు రాసిందని, కేంద్రం రాసిన లేఖలకు అప్పటి ప్రభుత్వం ఎందుకు బదులివ్వలేదని బండి సంజయ్ నిలదీశారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ హోదా ఇచ్చిందని బిజెపి అని తెలియజేశారు. కేంద్రం మూడు సార్లు లేఖలు రాసినా కెసిఆర్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని అడిగారు. కేంద్రం స్మార్ట్ సిటీ ఇస్తే తామే తెచ్చామని కెసిఆర్ అబద్దాలు చెబుతున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే కరువయ్యారని... ఆ పార్టీలోని నేతలంతా ఇతర పార్టీలవైపు చూస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ నిజాయితీపరుడైతే రూ.500 కోట్ల విలువైన భూదాన్ భూముల స్వాధీనంపై నోరెందుకు మెదపలేదని కేసీఆర్‌ను సంజయ్ ప్రశ్నించారు. కేసీఆరే పెద్ద అవినీతిపరుడంటూ సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాత అంశాలను తోడి సెంటిమెంట్ ను రెచ్చగొట్టేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఫైరయ్యారు. భద్రాచలంలోని 7 మండలాలను ఏపీలో విలీనానికి ఓకే చెప్పిందే కేసీఆర్ అంటూ సంజయ్ ఆరోపించారు. అప్పట్లో 7 మండలాలు పోతే పోనీ... తెలంగాణ వస్తుంది కదా అన్నదే కేసీఆర్ అని అన్నారు. కరీంనగర్ కు స్మార్ట్ సిటీ నిధులు కేసీఆర్ ఇచ్చిండా?... కేంద్రం కదా మంజూరు చేసింది అని సంజయ్ ప్రశ్నించారు. కేంద్రం స్మార్ట్ సిటీ కింద కేంద్రం రూ.196 కోట్లు మంజూరు చేస్తే రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ కింద అదనంగా రూ.196 కోట్లు ఆనాడు ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. స్మార్ట్ సిటీ నిధులను కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లిస్తే తాను కేంద్రానికి ఫిర్యాదు చేశానని చెప్పారు. లక్ష ఓట్లతో లక్షణంగా ఓడిపోయిన చరిత్ర వినోద్ కుమార్ ది అని విమర్శించారు బండి సంజయ్. కేసీఆర్ ముఖాన్ని జనం ఛీత్కరించారు.. వినోద్ ముఖానికి ఓట్లు పడే పరిస్థితి లేదన్నారు. పార్లమెంట్ లో 106 సార్లు మాట్లాడి వినోద్ కుమార్ సాధించేదేమిటని ప్రశ్నించారు. కరీంనగర్-వరంగల్, కరీంనగర్-జగిత్యాల, ఎల్లతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణకు నిధులెందుకు తీసుకురాలేదన్నారు. ఆ రోడ్ల విస్తరణ కోసం కేంద్రాన్ని ఒప్పించి దాదాపు రూ.5 వేల కోట్ల నిధులను తాను తీసుకొచ్చానని బండి తెలిపారు.